PRAMUKHANDHRA
22nd Year of Publication
We carry the news and views of Telugus
ప్రముఖాంధ్ర
₹15
నవంబర్ 2016
సంపాదకుడు
గోటేటి శ్రీ రామారావు
THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA,
GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA


VBC Jewellery
HOUSE OF VUMMIDI
No.11-B, Panagal Park.
Nageswara Rao Road,
T.Nagar,Chennai - 600017.
Tel:24342407 , 24346297.
Fax : 28346432.
E-Mail: vbcjewel@gmail.com
New No.78, Vani Mahal.
G.N Chetty Road,
T.Nagar,Chennai - 600017.
Ph : 2834 3650, 2834 3655.
Fax : 2834 5000.
E-Mail: vbcgold@gmail.com
www.vbcjewel.com

ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

నవంబర్ 2016

సంపుటి : 22 **263** సంచిక : 11

దేశాన్ని వ్యవసాయ ఫలసాయక దేశంగా పాలకులు గుర్తించకపోవడమే సర్వ అనర్థాలకూ కారణమైంది!

సుజలాం సుఫలాం మలయజ శీతలం –

మాతరమ్ వందే మాతరమ్ – అని స్తుతించాడు వంగ కవి బకించంద్రుడు, దేశానికి కనువిప్పు కల్గించిన జ్ఞాన కవి.

తేటలే తేరెడి కాంతి పూరముల
నుద్దీపించు ముత్యాల ము
ప్పేటల్ వోలె త్వదీయ కంఠమున
శోభింపుల్ నిగారించు, చే
నాటన్ జీవన శోషణల్ గగని
కృష్ణా గౌతమీ భద్రాలన్
గాటంపుందమి త్రావువారలిదె
కాంక్షే క్షీర మాంధ్రావనీ!
ఆ చాళుక్య నృపల రత్నముల
వియ్యమంది శ్రీ నొకతి
క్ష్యే చక్రేశుల లాలనల్ వడసి,
కృష్ణప్రాజ్య సామ్రాజ్య పీఠీ
చంచయకన్య – సరస గోష్ఠిన్
ప్రొద్దువో బుచ్చు నీ
ప్రాచీనాభ్యుదయమ్ము నెన్నెదరు
గర్వ స్ఫూర్తి తల్లీ సుతులా
సంతోసింపగదమ్మ ఆంధ్రజననీ!

ఏనాడో రాయప్రోలు సుబ్బారావు కీర్తించారు.

తెలుగు నాడు అనేక జీవ జల పూరితములైన నదుల నాడు. ఎక్కడెక్కడ గిచ్చిననూ పచ్చని చీరను బిళ్ళగోచీగా కట్టి, పయ్యెదను గాలి వీచికలకు రెపరపలాడించే ప్రకృతి. పైరులతో, ఫలసముదాయంతో, ఆకు కాయగూర లతో, ధాన్యరాశులతో దీప్తి చెందిన ఆంధ్ర సీమ. 'అన్నమో రామచంద్రా' అను ఆర్తనాదమునకు తావు యివ్వని పుణ్యభూమి. పాడిపంటలను సమృద్ధిగా యిచ్చే పశుసంపద. ఏనాడూ కెమికల్ ఎరువులకు ఎదురుచూడని రైతాంగం, తిండికలిగి, కండ కలిగిన మనుష్యులు, సహజ ప్రకృతీ సంపద. సకాలంలో కురిసే వర్షాల హర్షాతిపర్వం. డబ్బుతో పనిలేని గ్రామీణులు. గుప్పెడు ధాన్యమో, బియ్యమో, ఓ కొబ్బరికాయనో – క్రెడిట్ కార్డునిచ్చినట్టు యిచ్చి, సమస్తమునూ కొనుక్కోవాలనే జనబాహుళ్యం ఉండేది.

తోట దొడ్డిల్లో సర్వమూ పండించుకునే రోజులు. అపర ధాన్యాలకు కొదువే లేదు. చేలగట్లకు పోయి, కావాల్సిన కంది కంకుల్ని కోసి ఇంటికేగే భూమి రహితులు. ఉన్నవాడు లేనివాణ్ణి ఆదుకునే మంచితనం, అన్నీ మృగ్యమయ్యాయి.

పదీ, పన్నెండు మంది సంతానాన్ని కన్నప్పటికి, తిండికి లోటుండేది కాదు – ప్రక్కప్రక్కనే పెండ్లి సంబంధములను కలుపుకుంటూ, పల్లె పల్లెకూ రాకపోకలుండేవి.

పరిమిత సంతానంగా ఒకరిద్దరుగా ఉన్న కుటుంబాలూ, చేలూ, చెట్లూ, పొలాలూ, తోటలు నరకబడి గృహాలయిపోతూన్నాయ్. నశించిపోతున్న పచ్చదనం, గ్రామాల్లో కూడా పరిశ్రమల కాలుష్యం. ఇతర మతస్థులకున్న హక్కులు హిందువులకు లేకపోవడం, పంట దిగుబడులు తరగడం, ఉన్న పంటలైనా ఎరువు మందులతో పండడం, రోగాలూ, రొచ్చులూ, జనాభాకు సరిపోని తిండి, పర్యావరణ కాలుష్యం, పరిశ్రమల మోత, చేతి పరిశ్రమలకు చెడుకాలం – ఇవన్నీ ప్రజాప్రభుత్వాలు వచ్చిన తరువాతనే వచ్చాయ్.

ప్రజల ప్రభుత్వమనడమే గానీ, ప్రజలకు హక్కు, దిక్కులేని ప్రజాస్వామ్యం నడుస్తూంది. పారిశ్రామికంగా దేశం మారుతూంది. వ్యవసాయకంగా తరిగిపోతూంది! సింగపూరులు, జపానులు చేసేస్తామంటూ పచ్చని పొలాలను చేజేతులా నాశనం చెయ్యడం మంచిది కాదు. ఇది ఆర్థిక మాంద్యానికి దారితీయగలదు. ఆంధ్ర దేశం 'అన్నపూర్ణ' పేరును పోగొట్టుకోగలదు. తస్మాత్ జాగ్రత్త.

బుధజన విధేయుడు

– గోటేటి శ్రీరామారావు

Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com
YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-

శ్రీ జగద్గురు భారతీతీర్థ మహాస్వామి చరణుల ఉపదేశము

దాన ప్రాధాన్యం



విశుద్ధజ్ఞానదేహాయ త్రివేదీ దివ్యచక్షుషే!
శ్రేయః ప్రాప్తినిమిత్తాయ నమస్సోమార్ధధారిణే॥
నమామి యామినీనాథ రేఖాలంకృతకున్తలామ్ ।
భవానీం భవసన్తాపనిర్వాపణసుధానదీమ్॥

తుపాకీ గుండును గురిపెట్టి కాల్చే వ్యక్తి తన గుండును కాల్చదలచుకొన్న వస్తువుకంటె కొంచెం ఎత్తుకు గురిపెడ్తాడు. ఎందుకనగా గుండు ఆ వస్తువును చేరేటప్పటికి కొంత క్రిందకి తన మార్గంలో పయనిస్తుంది. కొంచెం పైకి గురిచూడటంతో గుండు వస్తువు క్రిందగా పోదు. వస్తువుకే తగులుతుంది. అదేవిధంగా ఒక గొప్ప సహాయం చేయటానికి దైవం మనకు అవకాశమిచ్చినప్పుడు మనం కూడ గొప్పగా ఆ అవకాశాన్ని ఉపయోగించుకొని గొప్పదైన సహాయం చేయాలని నిర్ణయించుకోవాలి. ఎలాగంటే మొదట్లోనే మనం స్వల్పమైన సహాయమే చేయాలనుకొంటే, అది కార్యరూపం ధరించే సమయానికి, అసలు సహాయం చేయటానికే మన మనస్సు అంగీకరించకపోవచ్చును.

చాలామంది ధనవంతులకు దానగుణం ఎందుకుండదని ఎక్కువమంది సందేహిస్తుంటారు. ఈ సందర్భంలో శ్రీశంకర భగవత్పాదులు చెప్పిన ఒక కథను తెలిసికొందాం. వేదాంతంలో ఆసక్తి కలిగి, ఆత్మశాంతిని కోరుకొనే వ్యక్తి ఈ బాహ్య ప్రపంచంలోని వస్తువులపట్ల ఆకర్షితుడు కాకుండ వాటిని త్యజించవలసిన ఆవశ్యకతను కూడ ఈ కథ వివరిస్తుంది.

ద్రవ్యం పల్లవతశ్చ్యుతం యది భవేత్ క్వాపి ప్రమాదాత్ తదా
శోకాయాథ తదర్పితం శ్రుతవతే తోషాయ చ శ్రేయసే ।
స్వాతంత్ర్యాద్విషయాః ప్రయాన్తి యదామీ శోకాయ తేస్యుశ్చిరం
సన్త్యక్తాః వయమేవ చేత్ సుఖమయం నిఃశ్రేయసం తన్వతే ॥

ఒక వృక్షం యొక్క ఫలం నేలపై రాలిపోయి వృథాగా నష్టమైతే ఆ చెట్టు యజమానికి బాధ కలుగుతుంది. కాని అదే పలాన్ని ఒక శ్రోత్రియునకి దానం చేస్తే ఆయనకు సంతోషం, శ్రేయస్సు కలుగుతాయి. అలాగే మన ఇంద్రియాలను విషయాల వెంట వాటి ఇష్టమొచ్చినట్లు పోవటానికి వదలితే దుఃఖం, విషాదం కలుగుతాయి. కాని స్వతంత్రంగా ఇంద్రియాలు తమ విషయ వాసనను త్యజిస్తే, అప్పుడు మనకు సుఖమూ, పరిపూర్ణమైన ఆనందం లభ్యమౌతాయి.

కూరగాయలు కొనుక్కుందామని పదిరూపాయలు జేబులో పెట్టుకొని ఓ పెద్ద మనిషి బజారుకు వెళ్లాడు. అయితే దారిలో జేబుదొంగొకడు ఆ పది రూపాయలను చాల తెలివిగా ఆ పెద్ద మనిషికి తెలియకుండ దొంగిలించాడు. కూరగాయలు కొనేముందు జేబులో చెయ్యిపెట్టుకొని పదిరూపాయల కోసం ఆ పెద్దమనిషి చూసుకొన్నాడు. అది దొరకలేదు. 'నా పదిరూపాయలు పోయా'యంటూ ఆయన దుఃఖించసాగాడు. కాని ప్రయోజనం ఏమిటి? పోయిన ధనం తిరిగిరాదుకదా!

మరొక సందర్భాన్ని పరిశీలిద్దాం. అదే పెద్ద మనిషి జేబులో పదిరూపాయలతో కూరగాయలు కొనటానికి వెళ్తున్నాడు. దారిలో ఓ పేదపిల్లవాడు కనబడి ఆయనను ఇలా అడిగాడు : "అయ్యా! నేను చాలా పేదవాణ్ణి. నా పాఠశాల ఫీజు కట్టటానికి డబ్బులేక ఇబ్బంది పడ్తున్నాను. ఓ పదిరూపాయలు దానం చేయండి. మీకు చాల పుణ్యముంటుంది." ఆ పిల్లవాని స్థితికి ఆ పెద్దమనిషి మనస్సు కరిగి జేబులో ఉన్న పదిరూపాయలను వానికి దానం చేశాడు. కూరగాయలు కొనకుండానే ఇంటికి తిరిగి వచ్చాడు.

జేబులోని పదిరూపాయలు దొంగలించబడినప్పుడు, ఉన్న డబ్బు పోయింది. పిల్లవానికి దానం చేసినప్పుడు కూడ డబ్బు పోయింది. కాని ముందు డబ్బులు వాటంతట అవే ఆ పెద్దమనిషికి తెలియకుండా పోయాయి. రెండవ సందర్భంలో ఆయనే స్వయంగా ఇచ్చాడు. అలా స్వయంగా దానం చేసినప్పుడు ఆయనకు ఆనందం కలిగింది. అయిష్టంగా పోగొట్టుకొన్నప్పుడు దుఃఖం కలిగింది. దానంతో ఆశీస్సులు కూడ లభించాయి.

స్వాతన్త్ర్యాద్విషయాః ప్రయాన్తి యదమీ శోకాయ

తన ఇంద్రియాలను సంతృప్తి పరచటానికై మనిషి ఎన్నో వస్తువులను సేకరిస్తాడు. తన ప్రమేయం లేకుండానే ఆ వస్తువులో ఏదైనా పోతే విపరీతంగా బాధపడ్తాడు. ఆ వస్తువులు అశాశ్వతమనీ, నిష్ఫలమైనవనీ గ్రహించి వాటిని తానే త్యజిస్తే– సుఖమయం నిఃశ్రేయసం, శ్రేయసే– అతనికి ఆనందమయమైన ముక్తి లభించవచ్చును.

"మనం ధనబలంతో ఎంత సాధించవచ్చు? ధనాన్ని అంటిపెట్టుకొని ఎంత కాలం ఉండగలం?" ఇటువంటి ఆలోచనలు వస్తే మనిషి తన ధనాన్ని అవసరమున్నవానికి దానం చేయగలడు. కాని ఆ విధమైన ఆలోచనలు రావటమే కష్టం. తన తోటివారితో పోల్చుకోవటం మనిషికి సహజం. "వాడికి లక్షరూపాయలున్నాయి. కాబట్టి నేను రెండు లక్షలైనా సంపాదించాలి. వాడికి పదిలక్షలు రూపాయలు ఆస్తి ఉంటే నేను కోటి రూపాయలు సంపాదించాలి. వాడి దగ్గర కోటిరూపాయలుంటే నేను పదికోట్లు సంపాదించాలి." ఇదీ

సామాన్య మానవుల ఆలోచనా సరళి. కాని రోజుకు అయిదురూపాయలు సంపాదించేవాడు, పదికోట్లు సంపాదించేవాడు అదే గుప్పెడన్నం తింటాడు. కోటీశ్వరుడు బంగారంతో బియ్యంగింజలు తయారుచేసికొని, వండుకొని తినగలడా? కుదరనే కుదరదు. మీమాంస శాస్త్రంలో ఒకచోట ఈ సంఘటన ఉంది. ఒకాయన **కృష్ణలం శ్రపయేత్** – ధాన్యరాసి అంత స్వర్ణనాణెములు– అని అడగటానికి బదుల **కృష్ణతిలం** (నల్లటి నువ్వులు) అని అడిగాడట. నల్లటి నువ్వులే దొరికాయట. కాని బంగారు నాణెములను ధాన్యంగా మార్చిన సంఘటనలు చరిత్రలోనే లేవు. ఈ విషయాలన్నీ తెలిసినా, మనిషి కోరికలకు అంతుండదు. ఈ కోరికలకు ముగింపు పలికి, మన దగ్గరున్న సంపదను సద్వినియోగం చేయటమెలా అని ఆలోచించాలి. ధనాన్ని వినియోగించటానికి మూడు మార్గాలున్నాయని ఒక శ్లోకం చెప్తుంది. ధనము తరిగిపోవడానికి మూడు దారులు.

1.దానం. 2. అనుభవించడం. 3.పోవడం.

దానం భోగో నాశః తిస్రో గతయో భవన్తి విత్తస్య ।
యో న దదాతి న భుంక్తే తస్య తృతీయా గతిర్భవతి ॥

ధనాన్ని ధనవంతుడు తన సుఖానికి గాని, దానానికి గాని ఉపయోగించకపోతే మూడవ మార్గం ఎన్నుకొంటుంది. అది ఏ విధంగా చేజారిపోతుంది.

కొందరు తమ పుత్రుని కోసం ధనాన్ని సంపాదిస్తున్నామని చెప్తారు. ఆ పుత్రుడు కూడబెట్టిన ధనాన్ని కాపాడి సక్రమంగా ఉపయోగించగలడని చెప్పలేం. అసలు ఆ కుమారునికి కూడబెట్టిన ధనం చేరుతుందా అన్నదీ సందేహమే.

తన స్నేహితుడు కూడబెట్టిన ధనాన్ని చాల బాగం దానం చేస్తుంటే "అదేమిటి అంతా దానం చేస్తున్నావు. నీకక్కరలేదా?" అని ఒకాయన అడిగాడు. స్నేహితుడు ఇలా సమాధానమిచ్చాడు: "నేను చాలా స్వార్థపరుణ్ణి. అందుకే సంపదను దానం చేస్తున్నాను. మరణం తరువాత కూడ సంపద మనవెంటే ఉండాలంటే మనం దానం చేయాలి. దానం చేసిన ధనం పుణ్యంగా మారుతుంది. పుణ్యం మరణానంతరం కూడ మనవెంటే ఉంటుంది. ధనం మరణం తరువాత మనతోపాటు రాదు. ఈ విషయం నాకు తెలుసు. అందుకనే నేను నా సంపదను బ్రతికియున్నప్పుడే దానం చేస్తున్నాను. ఇటువంటి స్వార్థపుటాలోచనతో దానం చేస్తున్నాను. అంతేకాని వాళ్ల క్షేమం కోసం కాదు." ఇది సరైన కారణమే.

మృతోఽప్యర్థం మక్ష్యామి బద్ధ్వా నేస్యామి మూర్ధని ।
ఇతి చేత్ సుదృఢా బుద్ధిః పాత్రే దేయమశంకితమ్॥

అలా మరణం తరువాత కూడ తన సంపద తనతోరావాలని స్థిరంగా నిశ్చయించుకొన్నవారు తప్పనిసరిగా దానం చేయాలి.

ధనంతో అనుబంధాన్ని పెంచుకొన్నవారు దానధర్మాలను ఎప్పటికప్పుడు వాయిదా వేస్తుంటారు. నహి యమోఽస్య కృతాకృతమీక్షతే। మరణం సమీపిస్తున్నప్పుడు యమధర్మరాజు, మనిషి తన దానధర్మ కార్యాలను ముగించటానికి సమయమివ్వడు. సరిగ్గా కాలం సమీపించగానే యమ ధర్మరాజు మనిషి ప్రాణాన్ని అపహరించుకుపోతాడు కాని ఆ మనిషి పూర్తి చేయని పనులకోసంగాని, ప్రారంభించవలసిన పనులకోసంగాని ఆగడు.

అజరామరవత్ ప్రాజ్ఞః విద్యామర్థం చ సాధయేత్ ।
గృహీత ఇవ కేశేషు మృత్యునా ధర్మమాచరేత్ ॥

ప్రాజ్ఞులైన వారు వార్ధక్యాన్ని, మృత్యువును లెక్క చేయకుండ విద్యను ధనాన్ని సంపాదిస్తూనే ఉండాలి. కాని దానధర్మాల విషయంలో ఆలోచన వచ్చిన వెంటనే ఆచరించాలి. మృత్యువు మనల్ని నీడలా వెంటాడుతుంటుందని మనం గుర్తుంచుకోవాలి. మన మరణం ఎప్పుడో యముడు నిర్ణయించాడు. కాని అదెప్పుడో మనమెవరం చెప్పలేం. కాబట్టి మనం అనుకున్న వెంటనే దానం చేయాలి.

కామ, క్రోధ, లోభాలవంటి దుర్గుణాలలో కామక్రోధాలను మనిషి తేలికగా అధిగమించవచ్చును. **వయసి గతే కః కామవికారః** అని శ్రీ ఆదిశంకరాచార్యులు చెప్పినట్లు వార్ధక్యంలో కామానికి స్థానమెక్క దుంది? అలాగే వార్ధక్యంలో మనిషి బలహీనుడవుతాడు కాబట్టి క్రోధానికి కూడ తావులేదు. కాని లోభం మాత్రం ఎప్పుడూ ఉంటుంది.

ధనవంతుడొకాయన సంపదను పెంచుకొంటూ పోయాడు. సంపద చాలా పెరిగింది. ఒకరోజు అనుకోకుండ ఆయన మరణించాడు. సంపదనంతా ఎక్కడ దాచిపెట్టాడో బంధువులెవరికి తెలియదు. అందువలన ఓ అజ్ఞాత వ్యక్తికి ఆ సంపద దక్కింది. ఇలా చాలా మంది జీవితాలలో జరుగుతుంది. అందుకనే మనకు శక్తి, వయసు ఉన్నప్పుడే ధార్మిక కార్యక్రమాలను నిర్వహించాలని చెప్తారు. పురాణాలలోని ఈ శ్లోకం దాన ప్రాధాన్యాన్ని వివరిస్తుంది.

పాత్రేభ్యో దీయతే నిత్యమ్ అనపేక్ష్య ప్రయోజనమ్

యోగ్యుడైన వ్యక్తికి ఎటువంటి ప్రయోజనాన్ని ఆశించకుండ దానం చేయాలి. ప్రయోజనాన్ని ఆశించకుండా ఎందుకు దానం చేయాలి?

కేవలం ధర్మబుద్ధ్యా యత్ ధర్మదానం ప్రచక్షతే ।

కేవలం ధార్మిక బుద్ధితో దానం చేయాలి. "దానం చేయటం మానవ కర్తవ్యం. అందుకనే నేను దానం చేస్తున్నాను" అనెడి భావనతో చేసెడి దానం ధర్మదానం.

కొందరు "నన్నెవరు వచ్చి దానం చేయమని అభ్యర్థించలేదు. ఎవరైనా వచ్చి అడిగినట్లయితే ఇచ్చి ఉండేవాడ్ని. నేను ఏమి చేయగలను?"అని చెప్తుంటారు. ఎటువంటి ప్రతిఫలాన్ని ఆశించకుండ దానం చేయాలి. మనం స్వచ్ఛందంగా గ్రహీత మనల్ని అభ్యర్థించకుండానే, దానం చేయాలి. అప్పుడు అనంతమైన ఫలం దక్కుతుంది. ఆ ఫలం శాశ్వతం.

ఆహూయ దీయతే దానం తదనన్తఫలం శ్రుతమ్ ।

"మా గృహానికి వచ్చి నన్ను అడగనివ్వండి. మా ఇంటి ద్గరగ వారందరికీ నా దానగుణం గురించి తెలియనివ్వండి" అనెడి చేసే దానానికి ఎటువంటి ఫలం దక్కదు. అడిగినప్పుడు దానం చేయాలనుకోవటం చాల తప్పు. దానం స్వచ్ఛందంగా చేయాలి.

కొంతమంది చాల ఎక్కువగానే ధనాన్ని సంపాదిస్తారు. కాని ఒక్క నయాపైసా కూడ పేదలకు దానం చేయరు. ధార్మిక కార్యక్రమాలకు ఖర్చుపెట్టరు. తమ కోసం కూడ ఖర్చుపెట్టుకోరు. ఇతరులకోసం వెచ్చించరు. "ఈ డబ్బుతో ఏమి చేస్తారు? మీ కోసం ఖర్చుపెట్టుకోవటం లేదు. అవసరమున్న వారికీ ఇవ్వటం లేదు. మరణించిన పిదప మీతో తీసుకువెళ్తారా?" అని మనం అడిగితే కోపంగా "అవును. నాతోపాటు నరకానికి తీసుకువెళ్తా"నని సమాధానమిస్తారు. అటువంటి వాళ్లు లోభగుణానికి మానవరూపం. మన పూర్వీకులు వాళ్లకీవిధంగా సలహానిచ్చారు. "బాబూ! మీతోపాటు మరణానంతరం కూడ మీ ధనాన్ని కూడ తీసుకువెళ్లదలచుకుంటే ఒక ఉపాయముంది. అలా చేస్తే మీరు విజయాన్ని పొందగలరు. అయితే ప్రస్తుత రూపంలో మీసంపదను తీసుకువెళ్లలేరు. ఇంకో రూపంలో తీసుకువెళ్లవచ్చును. సత్కార్యాలకు ధనాన్ని

వినియోగించాలి. అంటే అర్హులైన వారికి దానం చేయాలి. ఇలా ఖర్చుచేసిన ధనమంతా నీ మరణానంతరం నీతో వస్తుంది. దానధర్మాలలో ఉపయోగించిన ధనం ఖచ్చితంగా మరణానంతరం నీ వెంట వస్తుంది. ఇంకేమీరాదు. నీ మరణానంతరం బంధువులు స్నేహితులు స్మశానం వరకే వస్తారు. కళేబరాన్ని చితిమీద పెట్టి అంటించగానే వెనక్కు తిరుగుతారు.

మృతం శరీరమత్సృజ్య కాష్ఠలోష్ఠసమం క్షితౌ ।
విముఖా బాన్ధవా యాన్తి ధర్మస్తమనుగచ్ఛతి ॥

బంధువులు స్నేహితులు మృతుని వదలిపెట్టి, తమ తమ గృహాలను చేరుకొంటారు. సంపాదించిన ధర్మం మాత్రం మన వెంట వస్తుంది. మరణానంతరం పుణ్యకర్మల ఫలితమే మన వెంట వస్తుంది. ధర్మస్తమనుగచ్ఛతి. అలా సంపద మరణానంతరం పుణ్యకర్మల రూపంలో మన వెంట వస్తుంది. కాని ధన రూపంలో భౌతికంగా రాదు. అర్హులైన వారికి, అవసరమున్నవారికి దానం చేయటం ధార్మిక కర్మల నాచరించటం కావాలి. ధార్మిక కర్మలంటే వేదశాస్త్ర పండితులను గౌరవించటం, దైవసేవలో నిమగ్నులైన వారిని, పేదలకు అన్నదానం చేసే వారిని, యజ్ఞయాగాదులను ఆచరించేవారిని సమ్మానించటం. ఈ కార్యక్రమాలాచరించే వారికి పుణ్యం లభిస్తుంది. అటువంటి వారినే గుర్తుంచుకొంటారు. వారి సత్కర్మల ఫలస్వరూపమే వారివెంట ఉంటుంది.

"మేము అన్యాయంగా, అక్రమంగా చాల ధనాన్ని సంపాదించాం. మంచి పనులకోసం ఈ ధనాన్ని దానం చేస్తే ఏమిటి ప్రయోజనం?" అని కొందరు అడుగుతుంటారు. **న్యాయోపార్జితవిత్తేన కర్తవ్యం హ్యాతరక్షణమ్** న్యాయంగా సంపాదించిన ధనవం మాత్రమే ఆత్మరక్షణకు ఉపయోగపడ్తుంది. అంటే దీని అర్థం న్యాయంగా సంపాదించిన ధనాన్ని మాత్రమే పుణ్యకార్యాలకు వాడాలనేగా? అని వాళ్ల ప్రశ్న.

అక్రమంగా ధనాన్ని సంపాదించి, మరణిస్తే, అక్రమంగా ధనాన్ని సంపాదించిన వానిగా అట్టివాని పేరు నిలబడిపోతుంది. అతన్ని దురదృష్టంగా వెంటాడుతుంది. అలా అక్రమంగా సంపాదించిన ధనంతో అతనికి సత్ఫలితాలు తక్కువ. ధనం గురించి ఆలోచించేవానికి మరణించటం ఇష్టముండదు. అటువంటి వాళ్లు దెయ్యాలుగా మారి తమ ధనం దాచిపెట్టిన చోట తిరుగుతుంటారు. అలా వాళ్ల పునర్జన్మ కూడ కష్టమైన విషయమే.

యోஉసద్భ్యః ప్రతి గృహ్యాపి పునఃసద్భ్యః ప్రయచ్ఛతి ।
ఆత్మానం సంక్రమం కృత్వా పరాన్ తారయతే హి సః॥

ఓ కాపురుషుని (నీచుని) నుండి ఏదో ఒక వస్తువును దానంగా స్వీకరించి దానిని మరల ఓ సత్పురుషునికి దానమిచ్చిన వ్యక్తి, ఆ కాపురుషునికి, సత్పురుషునికి మధ్య వారధిగా పనిచేసినట్లవుతుంది. అప్పుడు కాపురుషునికి కూడ సత్పురుషునికి దానం చేసిన పుణ్యం లభిస్తుంది.

అన్యాయ మార్గంలో ధనం సంపాదించారన్నది వేరే విషయం. ఆ ధనం మొదట ఇచ్చిన వ్యక్తికి కూడ కొంత పుణ్యం లభిస్తుందన్నది తాత్పర్యం.

ఆత్మానం సంక్రమం కృత్వా పరాన్ తారయతే హి సః ॥

అన్యాయంగా సంపాదించిన మరొకరి ధనం కదా ఎలా దానం చేస్తామనే ప్రశ్న మనకు రాకూడదు. అలా అన్యాయ సంపాదన కూడ పుణ్యాన్ని ఇద్దరికీ సంపాదించి పెడ్తుంది. ధనం ఎవరికీ చెందినదో వారికీ, ఎవరు దానం చేస్తున్నదో వారికీ.

"నేను ధనవంతుణ్ణి కాను. దానం చేయటానికి నా దగ్గరేమీ లేదు. నేనేమీ చేయను. ధనమున్నట్లయితే దానం చేసేవాడిని" అని కొందరు బాధపడ్తుంటారు. అది సరైన ఆలోచన కాదు. నెలకు వందరూపాయలు సంపాదించేవాడు. వేయి రూపాయలు వస్తే దానం చేయగలననుకొంటాడు. కాని వేయి రూపాయలు నెలకు వస్తుంటే "నెలకు పదివేల రూపాయలు సంపాదించేవాడు కూడ ఏమీ దానం చేయటం లేదు. నేను ఏమీ చేయగలను" అని ఆలోచిస్తాడు. పదివేల రూపాయలు సంపాదిస్తుంటే లక్షరూపాయలు సంపాదించేవాడు ఇవ్వటం లేదని భావిస్తాడు. ఈ ఆలోచన ఇలా కొనసాగుతూనే ఉంటుంది. ఇతరులు ఇవ్వటం లేదంటూనే ఉంటాడు. తాను మాత్రం దానం చేయడు.

ఇంకా, ఇంకా ధనం కావాలని ఆలోచిస్తాం. కాని దానం చేయటం గురించి ఎప్పుడాలోచిస్తాం. మనం తినే ఆహారంలో కనీసం కొంతభాగాన్ని ఆకలితో బాధపడ్తున్న వారికి దానం చేయలేమా? ఆహారమంతా తింటే మన కొరిగేదీ ఏమీలేదు. కాని ఆకలితో చనిపోయే ఓ వ్యక్తిని మనమిచ్చే ఆహారం బ్రతికిస్తుంది.

ఈ విషయాలన్నీ మన పురాణాలలో చెప్పినవే. అవకాశమున్నప్పుడు దానం చేయడం అందరూ అలవరచుకోవాలి. కొందరు తాము చేయదలచుకొన్న దానం గురించి ఆర్భాటంతో ప్రకటిస్తారు. కాని తరువాత తమ మాటను నిలబెట్టుకోరు.

ఓ రాజుగారి ఆస్థానానికి సంగీత విద్వాంసుడొకరు వచ్చి అద్భుతంగా పాడి, రాజుగారిని మిగిలిన శ్రోతలను మెప్పించాడు. రాజుగారు చాలా సంతోషించి, అత్యుత్సాహంతో 50 వేల రూపాయల బహుమతిని ఇవ్వమని ఆజ్ఞాపించాడు. సంతోషంతో సంగీత విద్వాంసుడు ఖజానా నిర్వాహకుని వద్దకు వెళ్లి బహుమతినివ్వమని అడిగాడు. ఆయన బహుమతినివ్వటానికి అంగీకరించలేదు. అప్పుడు సంగీత విద్వాంసుడు తిరిగి రాజుగారి వద్దకు వెళ్లి జరిగిన విషయాన్ని విన్నవించుకొన్నాడు. రాజుగారు సంగీత విద్వాంసుని వైపు చూసి ఇలా అన్నారు: "నీకు బహుమానం ఇవ్వకపోవటంలో తప్పేమీ కనపడటంలేదు. నీవు సంగీత ధ్వనులతో నన్ను అలరించావు. అలాగే 50 వేల రూపాయల బహుమానం ప్రకటించినప్పుడు నేను చేసిన ధ్వనులు నిన్ను సంతోషపెట్టాయి. కాబట్టి నీకు బహుమానం ఇవ్వలేదు. అందులో నా బాధ్యతేమీ లేదు."

దానం స్వీకరించేవారు దానం గురించి వినగానే సంతోషిస్తారనే విషయంలో సందేహం లేదు. అంతమాత్రాన మనం మాట తప్పకూడదు.

అట్టి ధర్మ చింతన ప్రజలలో ఉంటే సత్కార్యాలే నిర్వహించబడ్తాయి. పరమాత్మ అట్టి ఉత్తమ భావనలను అందరికీ అనుగ్రహించుగాక. ●

Beautiful City - Beautiful Hotel
DO NOT MISS

Foreverar your Serivice in the Heart of Visakhaparnam
HOTEL Daspalla
Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని - చెన్నై
044 25204046, 26171341

పుష్పగిరి పీఠాన్ని భక్త ప్రపంచానికి యెరుకపరిచిన అభినవ విద్యారణ్య స్వామి!

శ్రీశ్రీశ్రీ విద్యారణ్య మహోద్దండ భారతీ తీర్థ స్వామివారు వారే. భారతీతీర్థ స్వామి వారు దేహం చాలించి ఒక సంవత్సరం గడచినదంటే నమ్మలేకున్నాను. వారికంనూ నా మనఃఫలకముపై మా కుటుంబ సభ్యుల మనఃఫలకములపై ముద్రితమై ఉన్నారు; భవిషత్కాలములో కూడా మా హృదయాలపై నిలిచి ఉంటారు.

పుష్పగిరి శంకర మహా సంస్థానానికి పునఃప్రాణ ప్రభావాన్ని నిలబెట్టినది ఆయనే! విద్యారణ్యస్వామి వారు నెలకొల్పిన శంకర పీఠశరశ్చంద్రికలను, శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థస్వాముల వారు పునఃప్రతిష్ఠింపచేసారు.

కడపకు అనతిదూరంలో ఉన్న చెన్నూరు, వారి జన్మస్థలం. చెన్నూరుకు అతి సమీపములో ఉన్న వారి పీఠం పుష్పగిరి పీఠం. ఇతఃపూర్వపు ఆచార్యులవారు మతిస్థిమితం కోల్పోయి, ఓ కటకటాల గదిలో ఉండేవారు. అక్కడి ఉద్యోగులు కటకటాల్లో ఉన్న స్వామివారికి భోజనం అందించేవారు. వారికి పూర్వం ఉన్న పీఠాధిపతి ఊసే లేదు.

పుష్పగిరి పీఠ కార్యాలయం కడపలో ఉండేది. అక్కడ మేనేజర్‌గా నియమింపబడినవారిచే పీఠాధిపతికి నెలభత్యంగా పంపేవారు. ప్రభుత్వ ఆధిపత్యంలో ఆ నిర్వహణ జరుగుతూండేది. అంటే పీఠా పూజా నిర్వహణముకు మాత్రమే భత్యముగా ఉండేది.

అలాటి ఆర్థిక దుస్థితిలో అధికారుల చేతుల్లో ఆధిపత్యం ఉన్న పరిస్థితుల్లో, ఆయన గురుస్వీకారం చేసారు. పీఠానికి గల వందల ఎకరాల భూమి ఫలదాయకాన్ని అన్యులెవరో అనుభవించేవారు. ఒక ఆపీసు గుమాస్తాకు యిచ్చే భత్యం కూడా ఉండేది కాదు. చెన్నూరులో వారుంటూండేవారు. కడప వెళ్ళిన నేను చెన్నూరు, వెళ్ళాను. అప్పుడే స్వామివారు టైఫాయిడ్ జ్వరం నుంచీ కోలుకుంటున్నారు. అలా జరిగిన ప్రథమ దర్శన విశేషమేమో వారిపై నాకూ, నాపై వారికీ యెడదాగని వాత్సల్యబంధమేదో యేర్పడింది. చెన్నయ్‌కు వారెపుడు వచ్చినా, వారు వారి పీఠారాధన విగ్రహంతో మా యింట్లోనే ఏర్పాటుచేసిన ప్రత్యేక గదిలో ఉండేవారు. చంద్రమౌళీశ్వరునికి యధావిధి పూజలూ, అభిషేక సేవలను నిష్ఠాగరిష్టంగా చేసేవారు. వారికి ఆతిథ్యమిచ్చే అపూర్వావకాశం ఎన్నో సంవత్సరాలు, ఎన్నో రోజులు జరుగుతూండేవి.

చెన్నయ్‌లో వారికెన్నో ఆస్తులున్నప్పటికినీ, ఎవరెవరి ఆక్రమణల్లోనూ ఉండేవి. వారికీ మాకూగల వాత్సల్యబంధమూ వారితో ఉండే శేషయ్యగారనే ఓ వయోవృద్ధ శిష్యుడు తోడుగా ఉండేవాడు. చెట్టి అనే పేరుగల వ్యక్తి వ్యాన్ డ్రైవర్‌గా ఉండేవాడు. అతడే డవాలూ, మెడలోంచి చేతుల సందుల్లోకి సంధింపబడే బెల్టు వేసుకునేవాడు.

శేషయ్యగారనే శిష్యరత్నం విశేష ప్రతిభ పరిచయం కలవాడైనందున ముందుగా తిరుచ్చి నుంచీ కన్యాకుమారి వరకు పుష్పగిరి శంకరుల ప్రతిభ పరిపూర్ణంగా వ్యాప్తించింది. తిరుచ్చిలోని అయ్యరులందరూ పెద్ద పెద్ద వ్యాపారస్తులు, పారిశ్రామికులు, ఆంధ్రలో విద్యారణ్యులు స్థాపింపబడిన పుష్పగిరి మహా సంస్థాన పీఠాధిపతి గజారోహణ గౌరవం చేసినంత ఘనముగా శిరఃపాదాలను

ఆలయాల జీర్ణోద్ధరణ

అది హిందూ మత నాయకుల సమ్మేళనం నుంచి వినవచ్చిన శంఖారావం. హిందూ ధర్మాచార్య సభ శిఖరాగ్ర సభ పేరుతో హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు జరిగిన సమావేశాలలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 100 మందికి పైగా హిందూ మతాధిపతులు పాల్గొన్నారు. దేవాదాయ ధర్మాదాయ చట్టం పరిధిలోకి రాని, నిర్లక్ష్యానికి గురైన ఆలయాలు, సంస్థల నిర్వహణ, జీర్ణోద్ధరణను చేపట్టాలని ఈ శిఖరాగ్ర సభ పిలుపునిచ్చింది. భవిష్యత్తులో హిందూ మతానికి లభించగల పోషణ, ఆచరించవలసిన సూత్రాలపై దృష్టి కేంద్రీకరించవలసిన అవసరం చాలా ఉందని మతాధిపతులు అభిప్రాయపడ్డారు. ఈ కృషిలో హిందూ సమాజం పాలుపంచుకునేటట్లు చేసేందుకు ఆచార్య సభ ట్రస్ట్ ఒక భవిష్య ప్రణాళికను కూడా రూపొందించింది. హిందూ మఠాలు, ఆలయాలు నిర్వహిస్తున్న కొన్ని పాఠశాలల్లో సంస్కృత భాషలో సంభాషించడాన్ని ప్రోత్సహించాలని కూడా ట్రస్ట్ నిర్ణయించింది. హిందూ వారసత్వ సంపద అధ్యయనాలు, పరిశోధనా సంస్థకు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. హిందూ సంస్కృతి, సంప్రదాయ ఆచారాలపై విదేశాలలో ఉన్న కొందరు చేసిన వక్రీకరణలు, చెప్పిన వక్రభాష్యాలను సరిదిద్దడంపై ఈ సంస్థ దృష్టి పెట్టుకుంది. "సామాజిక సౌభ్రాతృత్వం వెల్లివిరిసేందుకు వీలుగా సమాజంలోని పేద వర్గాల ఉద్ధరణకు అన్ని మతాల పెద్దలు మద్దతు ఇవ్వాలి. హిందూ ధర్మ ప్రచారం ఆచరణలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సమష్టి నాయకత్వ అవసరం కూడా ఉంది" అని చర్చల సరళిని నిర్దేశిస్తూ పుష్పగిరి మఠం శంకరాచార్య అన్నారు.

తెలుగుతల్లికి వందనం

తెలుగుకు వెల్తురు తోడయితే
తెలుగు వెలుగవుతుంది!
తెలుగుకు చీకటి చెలిమయితే
తెలుగుకు తెగులు పడుతుంది!

జనితులు తల్లిని భూషిస్తే
తనువు తరిస్తుందీ!
తల్లి భాషను భాషిస్తే
సంస్కృతి వికశిస్తుంది!

తల్లి మాటను జవదాటరాదని
తల్లిభాషను మరువరాదని
పెద్దలు చెబుతున్నారు-
ప్రముఖాంధ్ర గోటేటీ చెబుతున్నాడు!

నాడూ నేడూ రేపూ- తెలుగు
వాడు తెలుగు తేడై వెలుగుతాడూ!
తెలుగు వాడి వాడితనం
పంటలై పసిడిపంటలై పండుతుంది!

ఎన్నడూ ఎపుడూ వీడిపోని
వాడిపోని తెలుగు మల్లెల
సౌరభాలు సౌరభిస్తాయీ -తెలుగు
సుగంధాలు సువిశాల జగతి నందు పరిమళిస్తాయి!

జయ జయ తెలుగు మాతా
దివ్యారుణ కిరణ దేశమాతా
భారత మాతా వందనం
భవ్య సుజాతా వందనం

-గోటేటి

శ్రీకృష్ణ
అనేకమంది పెద్దల ఆశీస్సులు పొందిన 276 పేజీల గ్రంథం.
మూల్యం 200 రూపాయలు.
కొరియర్, రిజిష్టర్డు పోస్టు ఛార్జీలకూ రూ. 25లు చేర్చి,
రు. 225 రూపాయలు పంపండి. అదనపు ఛార్జీలను మేమే భరిస్తాం.
ఆధ్యాత్మ రామాయణం
ఈ గ్రంథ ప్రతిని మరో 120ల్ను
అదనంగా పంపించినచో
రెండు గ్రంథాలనూ ఒకే పోస్టులో పంపిస్తాం.
పంపించే డబ్బును ప్రముఖాంధ్ర పేరిటనే ,
ప్రముఖాంధ్ర అడ్రసుకే పంపండి.

మోకరిల్లు పాదాభివందనం చేసి పాదపూజలు జరిపేవారు. తెనాలిలో కంచిపీఠం ఆధీనంలో వసతి గృహవసతి తమకిచ్చేట్టు చూడమని పుష్పగిరి భారతీతీర్థులు అడిగారు.

స్వామివారితో నేనూ, ఆగమపండితులు హరిసోదరులు, శేషయ్యగారు అందరము వెళ్ళాం. పరమాచార్య పుష్పగిరి ఆచార్యలిరువురూ సంస్కృతములో మాట్లాడుకున్నారు. మఠాధీశులకూ, మహామంత్రులకు వేసే చక్కని బంగారు చెమికీ అంచుతో కూడిన కాశ్మీర్ శాలువాను పుష్పగిరిస్వామి మెడలో కప్పారు. పీఠాధిపతులు పీఠాధిపతులకు చేసే గౌరవాన్ని పుష్పగిరి వారికి చేసారు.

పరమాచర్య నన్ను ఆశీర్వదిస్తూ, అప్పుటి అరవై సంవత్సరాలకు పూర్వం కుంభకోణములో వారు వెలువరించిన సావనీర్‌ను తెప్పించి, ఒక్కొక్క పేజీనే ఏదో వ్రాసినట్లు వ్రాసి నాకు బహూకరించారు. అందున్న వ్యాసములు సంస్కృతాంధ్ర, తమిళములో ఉన్నాయ్. ఒక్క ముక్క అర్థం కాలేదు. కానీ జ్ఞానం విశేషంగా కలిగింది. ఆ భాషా శిల్పాన్నీ శబ్ద స్వరాలను ప్రముఖాంధ్రలో వ్రాస్తూ వచ్చాను. పరమాచార్య గారికి గోటేటివారు అంటే ఎంతో గౌరవము, వాత్సల్యమని అప్పుడే తెలిసింది.

పుష్పగిరి స్వామి వెళ్ళిన పని ఫలితాన్నివ్వలేదు. కానీ వారు మఠం నుంచీ కాలు బయటపెట్టగనే, ఎంతోమంది యాత్రీకులు, స్థానికులు, పండితులు పుష్పగిరి వారిని ఎంతో గౌరవంగా చూసారు. కొందరు వారి పాదాలకు ప్రణమిల్లారు. కాలడిలో బయల్దేరినప్పుడు ఆదిశంకరులు యెలా ఉన్నారో, అంతకన్నా తేజమొప్పారుతూ ఉన్నారు.

వారి జీవితము ఒక్కొక్క మెట్టునే అధిరోహస్తూ వచ్చింది. ఒంటెలూ, గుర్రాలూ, ఏనుగులూ, మేనాలు అధిరోహించి వెడ్తున్న సందడి గొన్నది. పుష్పగిరి సంస్థానము గొప్పది, గొప్ప వైభవంతో దీప్తిల్లినది. ఆ మాటకొస్తే కంచికామకోటి పీఠం కన్నా పురోత్తమైనది. శృంగేరీ స్థాపక గురువులు విద్యారణ్యులవారిచే స్థాపింపబడింది.

అత్యున్నతమైన పుష్పగిరి క్షేత్రస్థాయి పెరుగుతూన్నది. కుర్తాళంలో మౌనస్వామిచే స్థాపింపబడిన సిద్దేశ్వర పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ త్రివిక్రమ రామానంద భారతీ స్వాముల వారు - తత్పీఠ రజతోత్సవమును జరుపదలచి - పుష్పగిరి మహా సంస్థాన పీఠాధీశులనే ఉత్సవాలకు అధ్యక్షత వహిస్తూ దగ్గరుండి జరిపించమని ఆహ్వానించారు. అప్పటికి పుష్పగిరి సంస్థానంలో మందీ మార్బలం పెరిగింది. స్వామివారి చేతికి చాలా అధికారాలు వచ్చాయ్. వారితో మా దంపతులం, మా చిన్నబ్బాయి మరో కారులో బయల్దేరాం. త్రోవలో శ్రీరంగం, తిరుచ్చి, మధురలు చూచుకుంటూ కుర్తాళం వెళ్ళాం. రంగరంగ వైభవంగా ఓవారం రోజులు గడిచిపోయాయి. అక్కణ్ణుంచీ తిరువనంతపురం, కన్యాకుమారీ ఆలయాలు దర్శించుకుంటూ వచ్చాం. వెళ్ళినచోటల్లా ఆలయ స్థాపకాలూ, కుంభాభిషేకాలతో పుష్పగిరి శంకరులు అవిశ్రాంత పర్యటనం చేయడం ప్రారంభించారు. మద్రాసులోనే పలుచోట్ల భిక్షలు, పూజలు, తిరునాళ్ళల్లా జరుగుతూ వచ్చాయ్.

పుష్పగిరి పీఠానికి తగినంత ప్రచారం వచ్చింది. ముఖ్యంగా వారిని తీసుకుని ఆంధ్రాకు వెళ్ళాలి. అప్పుడు మధురవాణి సినీరమ పత్రికలతో బాటు మరికొన్ని పత్రికలను తోడు చేసుకున్నాం. ఆంధ్రా పర్యటనకు తీసుకువెళ్ళి మన తెలుగు శంకరపీఠాచార్యులని చెప్పాలి. నేను పుట్టి పెరిగిన ప్రాంతాలకన్నిటికీ తీసుకుని వెళ్ళాను.

మన శంకర పీఠం నుంచీ ఎవరో వచ్చారనుకున్నవారు మన పీఠాధీశులు గానే, గృహస్థులంతా చేరి రావడంతో పీఠ ప్రచారం జరిగింది. మా యింటికి శారదా చంద్రమౌళీశ్వరులను తీసుకుని వచ్చి అభిషేకములు చేయడం సంతృప్తిగా జరిగేవి. దూరం నుంచి వచ్చేవారికి మా ఇంటనే భోజనం ఏర్పాట్లు చేసేవారు. ఇలా స్వామివారు పర్యటనం చేస్తూన్నప్పుడు గుంటూరు శివార్లలో స్వామివారి వానూ, ట్రైలర్ కారు రోడ్డు ప్రక్కన పడి పల్టీ కొట్టింది. అందరికీ తీవ్రగాయాలు తగిలాయ్. స్వామివారికి స్పృహ తప్పింది. కానీ ఆయన ధ్యాస అంతా చంద్రమౌళీశ్వరుడు స్ఫటిక లింగంపైనే - అదే స్మరణ చంద్రమౌళీశ్వరుడు ఈ ప్రమాద వార్త గుంటూరు పోలీసులకు వెళ్ళింది. గుంటూరు హాస్పిటల్‌లో చేర్పించారు. అక్కడున్న మా తోడల్లుడు రామకృష్ణనించి వివరాలు తెలుసుకుంటూ న్నాను. అక్కడ సరియైన చికిత్స జరుగక పోలీసు వారే హైదరాబాద్ ఆసుపత్రిలో చేర్పించారు. నేనూ వెళ్ళి చూచాను. ఆపాదమస్తకమూ గాయాలే! గాయం పడని అవయవం లేదు. ఏ భాగానికి ఆ భాగము విడిపోయింది. అసలు కోలుకుంటారా, లేస్తారా, నడిచి తీరుతారా? అభిషేకం చేయగల్గుతారా? అన్నీ ప్రశ్నలే! ఈ వార్త తెలుసుకుని పోలీసులు భయపడుతున్నారు. తండాలు తండాలుగా జనం వస్తున్నారు. అందరివీ విచార ముఖాలే. మన తెలుగు శంకరాచార్యుల వారట, పుష్పగిరి మహా సంస్థానమట. ఇటువంటి చిన్న వయసుల్లో ఇట్లాగయ్యిందేఁవిటా - అని దవడలు నొక్కుకుంటూ వెక్కి వెక్కి ఏడవడం ప్రారంభించారు. గుంటూరు పోలీసులు ప్రత్యేక శ్రద్ధను తీసుకుని హైదరాబాదుకు తీసుకుని వెళ్ళారు. మా దంపతులం వారి దర్శనం చేసుకున్నాం. స్థానిక పెద్దలతో మాట్లాడాం.

స్వామిజీ హైదరాబాదు వెళ్ళిన విశేషమేమో ఆశ్రమం బేగంపేట పబ్లిక్ స్కూలుకు ఎదురుగా సరోజినీ పుల్లారెడ్డి గారు స్థలం, వాసం కల్పించారు. ఆ భవనాన్ని పుష్పగిరి ఆశ్రమంగా అభివృద్ధి చేసారు. అక్కడనుంచే పుష్పగిరి సంస్థానం ప్రచారం స్వామివారి సాధుశీలం, ప్రభావం, భక్తుల రాక పెరిగింది. ఆశ్రమంలోనే వచ్చినవారికి భోజనాలు పెట్టేవారు. ఆ ఆశ్రమాన్ని శ్రీశ్రీ భారతీతీర్థ స్వామి అభివృద్ధి చేసారు. శివాలయం, మూడంతస్తుల భవన నిర్మాణం చేయించారు.

(సశేషం)